# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 100 23-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత..



- అనారోగ్య, వృద్ధాప్య సమస్యలతో నాదెండ్ల కన్నుమూత
- హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో కన్నుమూత
- రేపు సాయంత్రం 4 గంటలకు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు
- 1984లో నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల
- నాదెండ్ల వయసు 90 సంవత్సరాలు

2లో



## మనకు ఓ టైమ్ వస్తుంది..

- భారతీయ సమాజంతో సమావేశం
- ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన మంత్రి
- పశ్చిమాసియా శాంతి చర్చలపై కీలక వ్యాఖ్యలు

2లో


## నౌకలపై ఇరాన్ దాడి

- మూడింటిపై దాడిచేసి రెండింటిని స్వాధీనం చేసుకున్న ఐఆర్‌జీసీ
- కాల్పుల విరమణ గడువును పొడిగించిన డొనాల్డ్ ట్రంప్
- హార్మూజ్ దిగ్బంధనం కొనసాగుతుందన్న అమెరికా అధ్యక్షుడు
- ఈ ప్రకటన వెలువడ్డ కొన్ని గంటలకే నౌకల ఆక్రమణకు తెరలేపిన ఇరాన్



# ఉత్తరాంధ్రకు మరో భారీ ప్రాజెక్ట్

- రాంబిల్లిలో రెన్యువబుల్ విప్లవం
- రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్
- 2,100 మందికి ఉపాధి కల్పించేలా ఎనర్జీ ప్లాంట్
- రేపు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



పారిశ్రామిక రంగంలో అనకాపల్లి జిల్లా పేరు మరోసారి మార్మోగనుంది. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పారిశ్రామిక వర్గాల్లో అనకాపల్లి జిల్లాపై జరిగిన చర్చ, ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు రానుంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తిపై ఫోకస్ పెడుతున్న క్రమంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆ రంగానికి హై ప్రయార్టీ ఇస్తోంది. దీంట్లో భాగంగా రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి సంస్థలకు పెద్ద పీట వేస్తోంది. ఈ క్రమంలో రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది.

- మిగతా 2వ పేజీలో

## పిఠాపురం వివాదంపై సీఎం చంద్రబాబు సీరియస్

- పిఠాపురంలో టీడీపీ, జనసేన నేతల మధ్య ప్రోటోకాల్ వివాదం
- టీడీపీ నేత వర్మ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లాకు ఫోన్ చేసి కీలక ఆదేశాలు
- బహిరంగ గొడవలు సరికాదని, క్రమశిక్షణ ముఖ్యమని హితవు
- వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు రంగంలోకి దిగిన అధిష్ఠానం

2లో





## పెద్దల చదువుకు పెద్ద పీట..

### వయోజనుల్లో అక్షరాస్యత పెంపుపై ప్రత్యేక శ్రద్ధ..

- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు
- విద్యా రంగంలో తెలంగాణ దూకుడు
- సీఎం రేవంత్ నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు

మారుతున్న కాలానికి తగినట్లు మారితేనే మనుగడ సాధ్యమవుతుంది.. ఈక్రమంలోనే విద్యా రంగంలోనూ పలు సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిల్లలంతా బడుల్లో ఉండడమే కాదు పెద్దలు సైతం అక్షరాలు నేర్చుకోవాలని ఆధునిక కాలపు అవసరాలకు తగినట్లు తమను తాము మల్చుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వం యోచన. అందుకే వయోజన అక్షరాస్యత పెంపునపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక

- మిగతా 2వ పేజీలో

### దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

- కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచన
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సూచన
- ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి

2లో



## బీజేపీ – బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

- కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు సాంకేతికపరమైన అంశాలకే పరిమితమన్న మహేశ్ గౌడ్
- కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని వ్యాఖ్య
- బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనన్న పీసీసీ అధ్యక్షుడు


2 లో

## చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయి

- సీమ నీటి హక్కుల కోసం వైసీపీ పోరాటానికి సిద్ధమవుతోందన్న కాకాణి
- సీమ ప్రాజెక్టులను చంద్రబాబు గాలికి వదిలేశారని మండిపాటు
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో చంద్రబాబు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శ

2 లో





## మోడీపై ఖర్గే అనుచిత వ్యాఖ్యలు

- కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రధాని మోడీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మోడీని ఉద్దేశిస్తూ

2లో

## కాళేశ్వరంపై కాంగ్రెస్ అబద్ధాల కోటలు బద్దలయ్యాయి..

- కక్ష కట్టినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారం చేసింది
- కుంగింది కాళేశ్వరం కాదు.. కేసీఆర్‌పై చేసిన కుట్రలు
- మాపై బురదచల్లారు కానీ.. నిప్పులాంటి నిజం బయటకు వచ్చింది
- అబద్ధానికి ఆడంబరం ఎక్కువ.. కానీ, ఆయుష్షు తక్కువ
- అబద్ధాలతో అద్భుతమైన నిజాలను చాలా కాలం దాచలేదు. -కేటీఆర్

2 లో



## నౌకలపై ఇరాన్ దాడి

దుబాయ్: పాక్ ప్రాయోజిత శాంతి చర్చల ప్రక్రియకు తూట్లు పొడుస్తూ ఇరాన్ హార్మూజ్ జలసంధిని మరోమారు కాల్పులమోతకు వేదికగా మార్చేసింది. శాంతి చర్చలకు ఫలవంతమైన ప్రతిపాదనలతో ఇరాన్ వచ్చేవరకు కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే విదేశీ నౌకలపై ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) నేవీ బలగాలు దాడులపర్వానికి తెరలేపాయి. ఇటీవల కొన్ని గంటలపాటు హార్మూజ్‌ను పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ చేసిన ప్రకటనతో పర్షియన్ గల్ఫ్ నుంచి ఆశగా బయల్దేరిన నౌకలు గురువారం హార్మూజ్ జలసంధిని దాటే క్రమంలో వాటిపైకి ఐఆర్‌జీసీ నేవీ గన్‌బోట్లు తుపాకులు ఎక్కుపెట్టాయి. దీంతో మూడు నౌకలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. మూడింటిలో రెండింటిని ఇరాన్ స్వాధీనంచేసుకుని తమ తీరానికి తీసుకెళ్తున్నాయి. మరోవైపు ఇరాన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు బయల్దేరని కారణంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సారథ్యంలోని బృందం సైతం పాకిస్తాన్‌కు బయల్దేరలేదు. దీంతో రెండో దఫా చర్చలు సాధ్యపడలేదు. అయితే చర్చలు తాత్కాలికంగా వాయిదాపడ్డాయేగానీ రద్దుకాలేదని అమెరికా వ్యాఖ్యానించింది. శుక్రవారంలోపు రెండోదఫా చర్చలు జరిగే వీలుందని ట్రంప్ చెప్పినట్లు 'ది న్యూయార్క్ పోస్ట్'తన కథనంలో పేర్కొంది. మరోవైపు బుధవారంతో ముగిసిపోతున్న కాల్పుల విరమణ గడువును ట్రంప్ హఠాత్తుగా పొడిగించడంపై మధ్యవర్తిత్వ దేశం పాకిస్తాన్ హర్షం వ్యక్తంచేసింది.

## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్న నాదెండ్ల... కాసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడే ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆయన అంత్యక్రియలను పంజాగుట్ట శ్మశానవాటికలో రేపు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల మృతి పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన... 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరారు. 1984లో చికిత్స కోసం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన సమయంలో... కొంత మంది ఎమ్మెల్యేల మద్దతులో నాదెండ్ల సీఎం అయ్యారు. నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల... ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించారు.

## మనకు ఓ టైమ్ వస్తుంది..

పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి భారతదేశానికి కూడా ఒక సమయం వస్తుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ప్రస్తుతం రాజ్‌నాథ్‌సింగ్ జర్మనీలో పర్యటిస్తున్నారు. బెర్లిన్‌లో భారతీయ సమాజం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి భారతదేశ పాత్ర ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ "భారతదేశం ప్రయత్నించిందని.. అయినా ప్రతిదానికీ ఒక సమయం ఉంటుంది. రేపన్న రోజున భారతదేశం ఆ పాత్రను పోషించి విజయం సాధించే సమయం రావొచ్చు. ఆ అవకాశాన్ని మాత్రం కొట్టిపారేయలేం. యుద్ధాన్ని ముగించాలని ఇరుపక్షాలకు ప్రధాని మోడీ ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. దౌత్యపరమైన విషయాల్లో మోడీకి చాలా సమతుల్య వైఖరి ఉంది." అని పేర్కొన్నారు. "రష్యా అధ్యక్షుడు పుతిన్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలిసినప్పుడు కూడా యుద్ధం గురించి మోడీ చర్చించారు. యుద్ధం ముగించాలని కోరారు. రేపు ట్రంప్‌ను కలిసినప్పుడు కూడా చర్చించి ఒక పరిష్కారం కనుగొనాలని చెప్పారు. భారతదేశం వ్యవహరిస్తున్న తీరును మీరు చూసే ఉంటారు. హార్మూజ్ జలసంధి నుంచి ఏ దేశానికి చెందిన నౌక వెళ్లలేకపోయింది. కానీ భారతదేశానికి చెందిన 7-8 నౌకలు వెళ్లగలిగాయి. దీనికి కారణం భారతదేశ వ్యవహరిస్తున్న సమతుల్య వైఖరే కారణం." అని రాజ్‌నాథ్‌సింగ్ వివరించారు.

## చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయి

రాయలసీమ నీటి హక్కుల కోసం వైసీపీ పోరాటానికి సిద్ధమవుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం సీమ ప్రాజెక్టులను గాలికి వదిలేశారని ఆయన మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ముందుచూపుతో చేపట్టిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చంద్రబాబు అడ్డుకున్నారని, దీనివల్ల సీమ రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని, అందుకే రాష్ట్ర ప్రయోజనాల విషయంలో బాబు మెతక వైఖరి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుల పేరు చెప్పుకుని 'నీరు-చెట్టు' పథకం ద్వారా గతంలో టీడీపీ నేతలు దోచుకున్నారని, ఇప్పుడూ అదే బాటలో సాగుతున్నారని విమర్శించారు. రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పే చంద్రబాబు మెడలు వంచి ప్రాజెక్టులను సాధించుకుందామని, అందుకు రైతులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## మోడీపై ఖర్గే అనుచిత వ్యాఖ్యలు

'టెర్రరిస్ట్" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడుతోంది. కేంద్రమంత్రులు కిరణ్ రిజిజు, నిర్మలా సీతారామన్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, పరువు నష్టం కలిగించే చర్య అని, ఎన్నికలను ప్రభావితం చేయగల తీవ్రమైన ఆరోపణ అని పేర్కొంది. ఖర్గేపై చర్య తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. మోడీని "ఉగ్రవాది" అని పిలవడం వ్యక్తిగత దూషణ, తీవ్రమైన వ్యక్తిగత దాడి, ప్రజల ప్రజాస్వామ్య ఎంపికను ప్రభావితం చేసే ప్రయత్నమని బీజేపీ పేర్కొంది. ఈ వ్యాఖ్య భారత శిక్షా స్మృతి (ఐపీసీ), 2023లోని సెక్షన్లు 175, 171/174 (అనుచిత ప్రభావం), 356(1) (పరువు నష్టం)తో సహా వివిధ సెక్షన్ల కింద శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుందని తెలిపింది.

# పెద్దల చదువుకు పెద్ద పీట..

(మొదటి పేజీ తరువాయి)

శ్రద్ధ కనపర్చుతోంది. అదే సమయంలో పాఠశాల విద్యా రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 100 శాతం అక్షరాస్యత వయోజన విద్యకు ప్రాధాన్యం సంపూర్ణ అక్షరాస్య రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. 45 ఏళ్లు పైబడిన వయసులో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులు నిర్వహించారు. దీంతో 202526 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుపడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది. తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్స్ట్రక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటుచేసుకున్నాయి. బోధన పద్ధతుల్లో వ్యూహాత్మకత 48% నుంచి 68%కు పెరిగింది. తరగతుల గదుల మెరుగైన నిర్వహణలో 42% నుంచి 65%కు, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినియోగం 35% నుంచి 58%కు పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఫ్లీచీ) పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2025-26 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9 శాతం నుంచి 35% శాతం వరకుడ ఇంగ్లీష్ లో 4 శాతం, 29% శాతండ ఉర్దూ లో 19 శాతం నుంచి 40% శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి.సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 202526లో 84% నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది.

## బీజేపీ - బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్పు కేవలం సాంకేతికపరమైన అంశాలకే పరిమితమని, అవినీతి జరగలేదని కోర్టు ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. కోర్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను కానీ, దాని విచారణను కానీ తప్పుబట్టలేదని... కేవలం నివేదిక రూపకల్పనలో అనుసరించిన విధానాన్ని మాత్రమే ప్రశ్నించిందని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని, బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. గతంలో ప్రధాని మోదీ, అమిత్ షా వంటి నేతలు కాళేశ్వరంను 'ఏటీఎం'తో పోల్చారని గుర్తు చేస్తూ... కాళేశ్వరం అంశంపై ఇప్పుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం వల్లే ఈ కుంభకోణంపై కేంద్రం మౌనంగా ఉందని ఆయన ఆరోపించారు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్ అబద్ధాల కోటలు బద్దలయ్యాయి..

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. "నిజం నిలకడ మీద తెలుస్తుంది" అనే నానుడి నేడు నిజమైందని, కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేసిన దుష్ప్రచారం తప్పని తేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై , కేంద్రంలోని బిజెపి తీరుపై నిప్పులు చెరిగారు. కాళేశ్వరం కుంగిపోయిందని రాష్ట్రమంతా తిరిగిన రేవంత్ రెడ్డికి (పిట్టల దొర) హైకోర్టు తీర్పు ఒక చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని బ్యారేజీ వద్దకు తీసుకువచ్చి ఫొటోలు దిగి, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను తాను మొదటి నుంచీ 'పీసీసీ రిపోర్ట్' అని పిలుస్తున్నానని, నేడు కోర్టు తీర్పుతో అది నిజమని నిరూపితమైందని అన్నారు. రేవంత్ రెడ్డి ఎవరిని తెచ్చి ఏ విధంగా వాదించినా, చివరకు సత్యమే గెలిచిందని, నిప్పులాంటి నిజం బయటకు వచ్చిందని ఆయన పునరుద్ఘాటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని, ఇది బిఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుకు అయిన మొత్తం ఖర్చు 94 వేల కోట్లు అయితే, లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోలేదని, రాజకీయ లబ్ధి కోసం వీళ్లే కూల్చారనే విషయం త్వరలోనే బయటపడుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రాజెక్టులు కట్టడమే నేరమన్నట్లుగా ప్రచారం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన బీజేపీని, ప్రధాని మోదీని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో ఆఘమేఘాల మీద స్పందించిన ఎన్డీఎస్ఏ (చీఐూూ), మరి ఎస్ఎల్బీసీ (రూాదీజ) కూలినప్పుడు, వట్టెం పంప్ హౌస్ మునిగిపోయినప్పుడు ఎక్కడకు పోయిందని ఎద్దేవా చేశారు.

## దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ రెండు సదస్సుల్లో జరిగిన ఎంవోయూలపై ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ అంశాలు, ఫ్యూచర్ సిటీ, ఇతర ప్రాంతాల్లో సంస్థలకు కేటాయించాల్సిన భూమి వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని డేటా సెంటర్లు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించి, ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ఆయా సంస్థలు రాష్ట్రంలో త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అన్నారు.

## పిఠాపురం వివాదంపై సీఎం చంద్రబాబు సీరియస్

కాకినాడ జిల్లా పిఠాపురంలో మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన నేతల మధ్య చెలరేగిన ప్రోటోకాల్ వివాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఫ్లెక్సీలో తన ఫొటో లేదన్న కారణంతో మొదలైన ఈ గొడవ, తోపులాట వరకు దారితీయడంపై ఆయన సీరియస్‌గా స్పందించారు. ఇలాంటి ఘటనలు కూటమికి నష్టం కలిగిస్తాయని, పునరావృతం కాకుండా చూడాలని పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... మంగళవారం పిఠాపురంలో జరిగిన 'పాడా' (పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సమావేశం సందర్భంగా ఈ వివాదం రాజుకుంది. కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో లేకపోవడంపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్వీఎస్ఎన్ వర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో జనసేన నేత పెండెం దొరబాబు కలుగజేసుకోవడంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం మొదలై, తోపులాటకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కూటమి శ్రేణుల్లో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం తన దృష్టికి రావడంతో సీఎం చంద్రబాబు వెంటనే స్పందించినట్లు సమాచారం.

## ఉత్తరాంధ్రకు మరో భారీ ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి.

రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా, త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గంలో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ప్లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి.

## హైవే పనుల్లో నిర్లక్ష్యంపై 'కమల' గళం

- ఎమ్మెల్యే కాలయాపనతోనే ప్రజలకు తిప్పలు
- అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి
- బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం వల్లనే కాలయాపన జరుగుతోందని బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ విమర్శించారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత రెండు ఏళ్లుగా వంతెన నిర్మాణం సాగదీస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 17న బిజెపి ఆధ్వర్యంలో రీజినల్ ఆఫీసర్‌ను కలిసి ఎలివేటెడ్ కారిడార్, అండర్‌పాస్ కావాలని వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. ఓ వర్గం సమాధుల సాకుతో పనులను అడ్డుకోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, మైనారిటీ సోదరులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో నష్టపరిహారం తీసుకున్నప్పటికీ అక్రమ కట్టడాలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. సర్వీసు రోడ్ల లేమితో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణగోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, కౌన్సిలర్లు పోలేపల్లి లక్ష్మి, బుడ్డ సురేష్, కడారి ఐలయ్య, పోలేపల్లి ముత్తయ్య, వంగల రమాకాంత్, కానుగు శేఖర్, పర్నే శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## మాతృసంస్థ అభివృద్ధికి బాధ్యత వహించాలి

- రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం
- ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**తొలివెలుగు, రామన్నపేట:** ఉన్నత విద్యనందించి జీవితంలో స్థిరపడేలా చేసిన మాతృసంస్థ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమవంతు బాధ్యతగా ఉదారంగా తోడ్పాటునందించాలని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం (అలుమ్ని మీట్) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాల ప్రగతి పథంలో పయనించాలంటే పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ప్రస్తుత విద్యార్థులకు దిశానిర్దేశం చేయడంతో పాటు, కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వి. నాగరాజు మాట్లాడుతూ.. ఈ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడటం గర్వకారణమన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన కళాశాల రుణం తీర్చుకునేందుకు అలుమ్ని సంఘం ద్వారా భవిష్యత్తులో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అలుమ్ని ఇంచార్జ్ డాక్టర్ ఎం. రవీందర్ రావు, కోశాధికారి వేముల సైదులు, పూర్వ విద్యార్థులు డాక్టర్ రాచమళ్ళ శ్రీను, బాలరాజు, శశిధర్ రెడ్డి, పావని, పాపయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులతో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- రూ. 5వేల ఆర్థిక సాయం అందజేసిన మాజీ ఎంపీపీ బాలానర్సింహ
- కాటం మృతికి నివాళులు



**తొలివెలుగు, రామన్నపేట:** ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ పూస బాలానర్సింహ అండగా నిలిచారు. గ్రామానికి చెందిన మల్లం కాటం అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న బాలానర్సింహ బుధవారం వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 5,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమని, ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్, వార్డు సభ్యులు పంది బాలరాజు, సింగనబోయిన బాలరాజు, రాధారపు మహేష్, కంబాలపెల్లి సత్తయ్య, కప్పల రాజు, నల్ల ఎలేష్ పాల్గొన్నారు. అలాగే మార్కెట్ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం, గర్దాస్ సురేష్, పబ్బు రమేష్, మల్లం మల్లయ్య, పంది శ్రీను, పంగ స్వామి, కొండారి వెంకటేష్, వంగల అరవిందు, కప్పల బాలకృష్ణ, రుద్రాల విక్కీ, కేస సాయి, కేస సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధపు ఆరోపణలకు అద్దం పట్టిన తీర్పు

- కేసీఆర్‌పై కుట్రలు భగ్నం..
- రైతాంగానికి కాంగ్రెస్, బీజేపీలు క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో హైకోర్టు వెలువరించిన తీర్పు హర్షణీయమని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పుతోనైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన కక్షపూరిత విధానాలను మార్చుకోవాలని హితవు పలికారు. తెలంగాణ జీవధారగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యపు నిందలు మోపి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని కాంగ్రెస్, బీజేపీలు కుట్రలు పన్నాయని విమర్శించారు. గత రెండేళ్లుగా రాజకీయ లబ్ధి కోసమే ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారని, చివరకు గత్యంతరం లేక ఇప్పుడు మరమ్మతులు చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌పై చేసిన నిరాధార ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టుపై న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య విజయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లోనే మరమ్మతులు పూర్తిచేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశం
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు
- గైర్హాజరైన ప్రిన్సిపాల్ తీరుపై అసంతృప్తి




**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతు పనులను గుర్తించి, ప్రస్తుత వేసవి సెలవుల్లోనే వాటిని పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం రామన్నపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని (హాస్టల్) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి మౌలిక సదుపాయాలను పరిశీలించి, తక్షణమే చేపట్టాల్సిన మరమ్మతుల వివరాలను నమోదు చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జనంపల్లిలోని రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించారు. తనిఖీ సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ విధులకు గైర్హాజరు కావడం పట్ల అదనపు కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మండువేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద తప్పనిసరిగా టెంట్లు ఏర్పాటు చేయాలని, చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా జరగాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎక్కడా అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అలాగే, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్ఈజీఎస్) కింద జరిగిన పనులకు సంబంధించిన చెల్లింపుల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో రాములు, ఎంపీవో రవూఫ్ అలీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఘనంగా బోగారం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం
- దీపప్రజ్వలన చేసి ప్రారంభించిన డీఈవో, సర్పంచ్
- ఉత్సాహంగా ముందస్తు బడిబాట కార్యక్రమం





**తొలివెలుగు, రామన్నపేట:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు అందుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) సత్యనారాయణ, బోగారం సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బోగారం గ్రామ పరిధిలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల (ఎంపీయూపీఎస్) వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముందస్తు 'బడిబాట' కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను నేరుగా కలిసి, పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేలా అవగాహన కల్పించారు. సర్పంచ్ సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తోందని వివరించారు. ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైకాని ఉమామహేష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గోగు ప్రమీల రమేష్ యాదవ్, నేరటి మానస సురేష్ యాదవ్, వనం అండాలు యాదగిరి, మేడి ఆంజనేయులు, కడారి పావని పాపయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పబ్బు జ్యోతి, పంచాయతీ కార్యదర్శి అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు. అలాగే, రామన్నపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే. శేఖర్, బోగారం పాఠశాల హెచ్‌ఎం ముస్కు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు వై. శ్రీలత, కే. శేఖర్, కే. సదానందం, భార్గవి, శిరీష, పాఠశాల సిబ్బంది భువనగిరి మంగమ్మ, రమేష్, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు కూనూరు శంకరమ్మలతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముద్దులొలికే చిన్నారుల 'గ్రాడ్యుయేషన్' ముచ్చట

- అంగన్‌వాడీలో ఘనంగా చిన్నారుల వీడ్కోలు వేడుక
- ఆటపాటల విద్యతోనే వికాసం: టీచర్ పార్వతి

**తొలివెలుగు, రాజపేట:** చిన్నారుల కేరింతలు.. తల్లిదండ్రుల మురిపెం మధ్య రాజపేట మండల కేంద్రంలోని రెండో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ప్లే-స్కూల్ విద్యను పూర్తి చేసుకుని వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలోకి అడుగుపెడుతున్న చిన్నారులకు అభినందన వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ పార్వతి ముందుగా తల్లులతో సమావేశమయ్యారు. కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తూ.. ఆటపాటల ద్వారా చిన్నారులకు అక్షరజ్ఞానం ఎలా అందిస్తున్నారో వివరించారు. ప్రతి నెలా చిన్నారుల ఎత్తు, బరువులను పర్యవేక్షిస్తూ, పోషకాహార లోపం ఉన్న వారికి ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఇస్తూ, ప్రతి రెండో శనివారం ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలన్నీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్న విధానాన్ని తల్లులకు వివరించారు. అనంతరం ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో తల్లులు ఎర్రగోకుల సంతోష, దుబ్బాసి వెన్నెల, పొలిమేర ప్రభావతి, కొత్త భానుప్రియ, సరిత, పవిత్ర, మల్లీశ్వరి, ఆయమ్మ విజయ తదితరులు పాల్గొన్నారు.





## రైతన్నలకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు

- మండలంలో ఐకేపీ కేంద్రాలను ప్రారంభించిన మార్కెటింగ్ చైర్మన్ ఉబ్బు వెంకయ్య
- పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకూడదని, ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య సూచించారు. బుధవారం మండల పరిధిలోని దామెర, మల్కాపురం ఐకేపీ కేంద్రాలతో పాటు చౌటుప్పల్ ఏఎంసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రాల్లో రైతులకు అవసరమైన తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించాలని, తూకంలో తేడాలు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దామెర సర్పంచ్ శ్రీధర్ రావు, మల్కాపురం సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, పట్టణాధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, చౌటుప్పల్ తహసీల్దార్ వీరాబాయి, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఏపీఎం యాదయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, కార్యదర్శి శంకరమ్మ, సీసీలు, ఆయా గ్రామాల రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గురువారం
23-04-2026

జనరల్ న్యూస్

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..






# ఉగ్రదాడి మృతులకు అశ్రునివాళి

- రాజపేటలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన
- కశ్మీర్‌లో పర్యాటకుల హత్యపై తీవ్ర దిగ్భ్రాంతి

**తొలివెలుగు, రాజపేట:** జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక హిందూ పర్యాటకులకు రాజపేట మండల కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించి సంతాపం తెలిపారు. గతేడాది (2025 ఏప్రిల్ 22న) అనంతనాగ్ జిల్లా పహల్గామ్ సమీపంలోని బైసరన్ పార్కు వద్ద టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఘటనను ఈ సందర్భంగా వారు తీవ్రంగా ఖండించారు. అమాయకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రవాదుల చర్యలు అత్యంత హేయమైనవని మండిపడ్డారు. ఉగ్ర మూకలను ఏరివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ మండల సంయోజక్ సట్టు రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్, బూరుగు సంతోష్ రెడ్డి, శంకర్, నరేష్, మధుసూదన్, సిద్దులు, అవినాష్, సాయికృష్ణ, భగవాన్ రెడ్డి, శ్రీధర్, చింటూ, పరశురామ్, బాబు తదితరులతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న కమలదళం.. రాజపేటలో ఖర్గే దిష్టిబొమ్మ దహనం

- ప్రధానిపై వ్యాఖ్యలను సహించబోం..
- జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ ఆగ్రహం



**తొలివెలుగు, రాజపేట:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాజపేట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్‌కు వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలన్నీ కీర్తిస్తున్న మహోన్నత నాయకుడు మోదీపై ఖర్గే స్థాయి మరచి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. గతంలోనూ స్వయం ప్రతిపత్తి గల ఆర్ఎస్ఎస్‌పై ఖర్గే విషం చిమ్మారని, ఆయనకు మతిభ్రమించినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. వెంటనే ఆయనపై కేసు నమోదు చేసి, పిచ్చాసుపత్రికి తరలించాలని డిమాండ్ చేశారు. ఖర్గేను పార్టీ నుంచి బహిష్కరించాలని, లేనిపక్షంలో భారత జాతి కాంగ్రెస్‌ను క్షమించదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాసోజు సంపత్, దాచేపల్లి శ్రీనివాస్, కుమ్మరి లక్ష్మణ్, మెండు భగవాన్ రెడ్డి, అంకతి భాస్కర్, బూర్గు శేఖర్ రెడ్డి, సాధనబోయిన శంకర్, చిగుల్లా బీరయ్య, బిర్రు సురేష్, ఎక్కలదేవి శ్రీహరి, శివరాములు, నవీన్, వేణు, మణికంఠ పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి 'జైశ్రీరామ్' అండ

- దేవేంద్ర మృతిపై సంతాపం.. రూ. 5వేల సాయం



**తొలివెలుగు, రాజపేట:** మండల కేంద్రానికి చెందిన దుస దేవేంద్ర ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబానికి జైశ్రీరామ్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఫౌండేషన్ తరఫున బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సాయం కింద రూ. 5,000 నగదును అందజేశారు. సంస్థ చేపట్టిన 180వ సేవా కార్యక్రమం ఇదని నిర్వాహకులు తెలిపారు. కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడంలో ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి శ్రీనివాస్, చెలమనపల్లి లక్ష్మణ్, కోయ మధు, చిగుళ్ల బీరయ్య, బిర్రు సురేష్, అంకతి భాస్కర్, సంగం వేణు, సఖినాల చిరంజీవి, సాయి, నవీన్, ముని, ఫౌండేషన్ సభ్యులు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గుండు అనసూయ మృతికి నివాళులు

- అంతిమయాత్రలో పాల్గొన్న నేతలు



**తొలివెలుగు, రాజపేట:** రాజపేట పట్టణ కేంద్రానికి చెందిన హబ్సీగూడ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండు రాజన్న మాతృమూర్తి అనసూయ మృతికి పలువురు కాంగ్రెస్ నేతలు ఘన నివాళులర్పించారు. బుధవారం ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో ఆయన పాల్గొని పాడె మోశారు. రాజన్నను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతిమ యాత్రలో సీనియర్ నాయకులు కంది ఆగిరెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్, నాయకులు బాబురావు, రాజు నాయక్, మురళీ ముదిరాజ్, మాలు నాయక్, వాసు నాయక్, సుమన్ నాయక్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# పదిహేను రోజుల్లో మళ్లీ 'త్రిఫ్ట్' పథకం

- మండలి చైర్మన్ గుత్తాతో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- ఏపీ, తమిళనాడు తరహాలో పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- శాసనమండలి చైర్మన్‌కు రఘునాథపురం పద్మశాలి సంఘం నేతల వినతి



**తొలివెలుగు, రాజపేట:** చేనేత, పవర్‌లూమ్ (మరమగ్గాల) కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించిన 'త్రిఫ్ట్' (పొదుపు) పథకాన్ని మరో 10 నుంచి 15 రోజుల్లో పునఃప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డితో పాటు చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన సీఎం పథకం పునరుద్ధరణకు అధికారులను ఆదేశించినట్లు చైర్మన్ తెలిపారు. రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు బుధవారం హైదరాబాద్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేనేత, పవర్‌లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రఘునాథపురం మాజీ సర్పంచ్, యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గాడిపెల్లి శ్రవణ్ కుమార్, రాష్ట్ర యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సామల భాస్కర్ తదితరులు చైర్మన్‌కు సమస్యల తీవ్రతను వివరించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకం గడువు 2025 మే నెలతో ముగిసిందని, 11 నెలలు గడుస్తున్నా ఇంకా పునఃప్రారంభం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు వర్తింపజేస్తున్నట్లుగానే (కార్మికుడు 8 శాతం అంటే రూ.1200 డిపాజిట్ చేస్తే, ప్రభుత్వం 16 శాతం అంటే రూ.2400 జమ చేసేలా) పవర్ లూమ్ కార్మికులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో మరమగ్గాలకు 500 యూనిట్లు, తమిళనాడులో 750 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఆయా ప్రభుత్వాలు అందిస్తున్నాయని, అదే తరహాలో తెలంగాణలోనూ ఉచిత కరెంటును అమలు చేసి ఆదుకోవాలని, కార్మికుల రుణమాఫీ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వారి విన్నపాలకు సానుకూలంగా స్పందించిన మండలి చైర్మన్.. వెంటనే సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపడం పట్ల పద్మశాలి సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గుత్తా సుఖేందర్ రెడ్డిని చేనేత శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు లగిసెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో దేశ, దైవ భక్తిని పెంపొందించాలి





- హిందూ సమాజం చైతన్యవంతంగా ఉంటేనే దేశం సుభిక్షం
- విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ
- రాజపేటలో పండుగలా హిందూ సమ్మేళనం

**తొలివెలుగు, రాజపేట:** పిల్లల్లో చిన్నతనం నుంచే దేశభక్తి, దైవభక్తిని నూరిపోయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని నల్గొండ విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం వద్ద ఉప మండల స్థాయి 'హిందూ సమ్మేళనం' అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజం సంఘటితంగా ఉన్నప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని, తద్వారా భారత్ ప్రపంచానికి విశ్వగురువుగా నిలుస్తుందని ఆకాంక్షించారు. అంతకుముందు పట్టణంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సామల రేణుశ్రీ నృత్యం, పబ్బోజు శోభారాణి భక్తి గీతాలు, పాముకుంట పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హనుమాన్ చాలీసా పారాయణం, సామూహిక గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ శాంభవి పీఠాధిపతి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ధర్మ పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా వక్త కాసుల మానస, సమ్మేళన సమితి అధ్యక్షులు పులిగిల్ల నరసింహులు, కార్యదర్శి పబ్బోజు శ్రీనివాసులు, సంతోష్ రెడ్డి, జ్ఞానేందర్ తదితరులు పాల్గొన్నారు. 9 గ్రామాల సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైన ఈ వేడుక అనంతరం అన్నదానం నిర్వహించారు.






# గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా నిలవాలి

- 28న భువనగిరిలో సుశ్రుత వైద్యుల 9వ జిల్లా మహాసభలు
- ఆత్మకూరు(ఎం)లో వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ
- హాజరుకానున్న పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** ప్రజల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామీణ వైద్యులకు (ఆర్ఎంపీ) ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల లక్ష్మయ్య గౌడ్ కోరారు. ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో సంఘం 9వ జిల్లా వార్షికోత్సవ మహాసభల కరపత్రాలను మంగళవారం ఆయన జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రొయ్యల శంకర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీన భువనగిరి పట్టణ కేంద్రంలోని మద్ది నర్సింహారెడ్డి గార్డెన్స్‌లో సంఘం 9వ జిల్లా వార్షికోత్సవ మహాసభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు. వారితో పాటు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ మనోహర్, జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎలె బాలకృష్ణ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గుర్రం లక్ష్మీ నర్సింహారెడ్డి తదితరులు విచ్చేస్తున్నారని వివరించారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంగ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బి.ఎల్. నారాయణ, గౌరవాధ్యక్షుడు ఆలేపు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి అంబటి రవి కిరణ్, జిల్లా నాయకులు అంబటి రాజయ్య, మండల ప్రచార కార్యదర్శి మస్కు నరేందర్, కమిటీ సభ్యులు అత్రి, లక్ష్మణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# బీర్ల ఐలయ్యపై అసత్య ప్రచారాలు ఆపాలి

- మైనింగ్, క్రషర్ వ్యవహారంలో మాకు సంబంధం లేదు
- యజమానుల వివరణతో బీఆర్ఎస్‌కు చెంపపెట్టు: కాంగ్రెస్

**తొలివెలుగు, రాజపేట:** చల్లూరు మైనింగ్, క్రషర్ అంశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యపై చేస్తున్న నిరాధార ఆరోపణలను ఇప్పటికైనా మానుకోవాలని రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హితవు పలికారు. బుధవారం రాజపేటలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మైనింగ్, క్రషర్ యజమానులు ఇప్పటికే మీడియా ముఖంగా అన్ని ఆధారాలతో సహా వివరణ ఇచ్చారని, ఈ వ్యవహారంలో బీర్ల ఐలయ్యకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల మనిషిగా, నిత్యం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఐలయ్యపై తప్పుడు ప్రచారాలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం బీఆర్ఎస్ నేతలకు తగదన్నారు. యజమానుల ప్రెస్‌మీట్‌తో ప్రతిపక్ష నేతలకు చెంపపెట్టు తగిలిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా విమర్శలు కట్టిపెట్టి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బీర్ల ఐలయ్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి బియ్యం పంపిణీ

- గౌటే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత



**తొలివెలుగు, రాజపేట:** మండల కేంద్రానికి చెందిన దూస దేవేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబానికి గౌటే ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఫౌండేషన్ అధినేత గౌటే లక్ష్మణ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే తమ సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూస రాజు, జూపల్లి రాములు, కొంక భాస్కర్, మామిడి రాజు, గౌటే ప్రశాంత్, వరిమడ్ల కనకయ్య, అరుణ్, కృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## దేవేంద్ర కుటుంబానికి బియ్యం అందజేత

- ఉపసర్పంచ్ నమిల కేదారీ ఉదారత

**తొలివెలుగు, రాజపేట:** రాజపేట గ్రామానికి చెందిన దూస దేవేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి నిరుపేద కుటుంబానికి స్థానిక ఉపసర్పంచ్ నమిల కేదారీ అండగా నిలిచారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, స్వాతి చికెన్ సెంటర్ తరఫున నరేష్‌తో కలిసి 50 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతల రవి, కొంక భాస్కర్, పిసికె గణేష్, పిండికూర మహేష్, చింటూ, భాను, సాయి, గొల్లేన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ఏకకాలంలో గుర్తించాలి

- ఏబీసీ కేటగిరీల విభజన కాలయాపనకే..
- మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్



**తొలివెలుగు, భువనగిరి:** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలు సరికావని మలిదశ ఉద్యమకారుడు, టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన భువనగిరిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం కేకే కమిటీని వేయడం సమ్మతం కాదన్నారు. నిజమైన ఉద్యమకారులను గుర్తించాలంటే చట్టబద్ధత కలిగిన జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ఏబీసీ కేటగిరీల విభజన కేవలం కాలయాపన కోసమేనని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, అన్ని కేటగిరీల ఉద్యమకారులను ఏకకాలంలో గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు.

## భద్రకాళీమాత కల్యాణానికి పోచంపల్లి పట్టు

- భక్తిశ్రద్ధలతో పట్టుచీర నేసిన రుద్ర వంశస్థులు
- ఆలయ ఈవో, ప్రధాన అర్చకులకు వస్త్రాల అందజేత



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** చారిత్రక ప్రసిద్ధి గాంచిన వరంగల్ భద్రకాళి దేవాలయంలో ఏటా అత్యంత వైభవంగా జరిగే భద్రకాళి - భద్రేశ్వర స్వామి కల్యాణోత్సవానికి భూదాన్ పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు తమ వంతు భక్తిని చాటుకున్నారు. అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాల కోసం స్థానిక రుద్ర వంశస్థులు పోచంపల్లి పట్టుచీరను ప్రత్యేకంగా నేసి సమర్పించారు. రుద్ర శ్రీశైలం, రుద్ర చెన్నకేశవులు, రుద్ర పాండురంగ శాస్త్రిల ఆధ్వర్యంలో ఈ పట్టుచీరను అత్యంత భక్తిశ్రద్ధలతో సుమారు 20 రోజుల పాటు శ్రమించి ఆకర్షణీయంగా రూపొందించారు. ప్రతి ఏడాదీ అమ్మవారి కల్యాణానికి తమ కుటుంబం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వారు తెలిపారు. బుధవారం వరంగల్‌లోని భద్రకాళి ఆలయానికి చేరుకున్న రుద్ర కుటుంబ సభ్యులు.. ఈ పట్టుచీరను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) రాముల సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తదితరులకు శాస్త్రోక్తంగా అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు తోపునూరు వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి, గాండ్ల స్రవంతి, పూర్ణచందర్, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకల నాంచారమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలి

- సమీక్ష సమావేశంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు
- సమీక్షలో అధికారులకు ఆర్డీవో దిశానిర్దేశం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** త్వరలో జరగనున్న ఎరుకల నాంచారమ్మ జాతరను అత్యంత వైభవంగా, ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో శేఖర్‌రెడ్డి ఆదేశించారు. భూదాన్ పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లిలో ఉన్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక దేవాలయమైన ఎరుకల నాంచారమ్మ ఆలయ వార్షికోత్సవం (జాతర) ఈ నెల 28 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఎరుకల సంఘం నాయకులతో కలిసి జాతర ఏర్పాట్లపై ఆర్డీవో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తుల కోసం ప్రత్యేకంగా చలువ పందిళ్లు, షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి వసతి కల్పించాలన్నారు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్డీవో పీడీ నాగిరెడ్డి, తహసీల్దార్ (ఎమ్మార్వో) శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో భాస్కర్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరమాండ్ల మహాలక్ష్మి దానయ్య, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి రాములు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంగెంలో అధికారులకు 'ధాన్యం' సెగ





- కేంద్రం ప్రారంభించకుండానే వెనుదిరిగిన అధికారులు
- రెండు కేంద్రాల కోసం రైతుల పట్టు.. వాగ్వాదం

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం బుధవారం రైతుల నిరసన మధ్య అర్థాంతరంగా నిలిచిపోయింది. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులను రైతులు అడ్డుకున్నారు. గతంలో గ్రామంలో రెండు కేంద్రాలు ఉండేవని, ఇప్పుడు ఒకటే కేంద్రం ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులను నిలదీశారు. గత సీజన్‌లో రెండు కేంద్రాలు ఉన్నప్పుడే ధాన్యం సేకరణకు మూడు నెలల సమయం పట్టిందని.. ఇప్పుడు ఒకటే కేంద్రం ఉంటే వర్షాకాలం వచ్చేలోపు కొనుగోళ్లు పూర్తవుతాయా? అని ప్రశ్నించారు. వానలు పడితే తమ ధాన్యం పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రం కోసం భూమిని అద్దెకు ఇచ్చిన రైతులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని మండిపడ్డారు. రైతుల పట్టుదలతో వాగ్వాదం చోటుచేసుకోవడంతో చేసేది లేక అధికారులు, ప్రజాప్రతినిధులు కేంద్రం ప్రారంభించకుండానే వెనుదిరిగారు.

## చౌటుప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణంలో కీలక మార్పు

- గోడలకు బదులు పిల్లర్లపై ఎలివేటెడ్ కారిడార్
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో అధికారుల నిర్ణయం
- అండర్‌పాస్ పనులకు మార్కింగ్ ప్రారంభం



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణ ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ ప్రణాళికలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత యూపీ వాల్స్ (మట్టి గోడలు) నిర్మించాలని భావించినప్పటికీ, పట్టణ భవిష్యత్తు, ప్రజల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని దానిని ఎలివేటెడ్ కారిడార్‌గా (పిల్లర్ల ద్వారా) మార్చాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, పాలకవర్గ సభ్యులు ఈ నెల 9న ఎమ్మెల్యేను కలిసి పట్టణ ప్రజల ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. జాతీయ రహదారి అధికారులతో చర్చించి బస్టాండ్ ప్రాంతంలో సుమారు 30 మీటర్ల వెడల్పుతో అండర్‌పాస్ నిర్మించాలని, వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సానుకూలంగా స్పందించిన అధికారులు.. బుధవారం 20 మీటర్ల వెడల్పుతో అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించిన మార్కింగ్ పనులను ప్రారంభించారు. పట్టణ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## మునుగోడులో కొత్తగా చేసిందేమిటి?

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ధ్వజం
- ఫ్లైఓవర్ పనులపై అవగాహన లేదు
- అభివృద్ధిపై 'బోగస్' ప్రచారాలు ఆపాలి
- దర్గాకు పరిహారం ఇచ్చినా ఎందుకు తొలగించలేదు?
- రాజీనామా చేసి వస్తే ప్రజలే తీర్పు చెబుతారు



**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు నియోజకవర్గంలో గతంలో తాను చేసిన పనులు తప్ప, ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొత్తగా సాధించిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. బుధవారం చౌటుప్పల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌటుప్పల్ హైవే విస్తరణ, ఫ్లైఓవర్ పనుల గురించి ఎమ్మెల్యేకు కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. తాను మంజూరు చేయించిన పనులను కూడా పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పాడి, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామని గుర్తు చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో సర్వీస్ రోడ్డులో ఉన్న దర్గాకు కోటి రూపాయల పరిహారం చెల్లించినా, దానిని తొలగించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాకుండా, సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నానంటూ 'బోగస్' ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రీల్స్ చేస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందదని హితవు పలికారు. దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు రావాలని, ప్రజలు ఎవరి పక్షాన ఉన్నారో తేలిపోతుందని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభకు గుర్తింపు.. విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

- దాతల సహకారం అభినందనీయం
- కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ముక్తాపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ - తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు దాతలు సన్న నరసింహం, నరేందర్‌ల ఆర్థిక సహకారంతో సైకిళ్లను బహుకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి విద్యార్థులకు సైకిళ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలల మోజులో పడి ప్రభుత్వ బడులను విస్మరించవద్దని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పంతుల మధుబాబు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ యాదమ్మ, మాజీ సర్పంచ్ మునుకుంట్ల బాలచంద్రం, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- దళారులను నమ్మి మోసపోవద్దు
- ఏ గ్రేడ్ రకానికి రూ. 2203 మద్దతు ధర
- మార్కెట్ చైర్మన్ భూక్యా భీమా నాయక్



**తొలివెలుగు, వలిగొండ:** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని వలిగొండ - రామన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా భీమా నాయక్ సూచించారు. వలిగొండ మండలంలోని తుర్కపల్లి(ఎం), నరసాపురం, దుప్పల్లి, వేములకొండ సహా పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం తేమ శాతం లేకుండా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 మద్దతు ధర చెల్లిస్తామని వెల్లడించారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి గింజను ప్రభుత్వమే సేకరిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, సర్పంచులు, ఏపీఎం అంజయ్య, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## సర్కారు బడి.. చదువుల నిధి

- దోతిగూడెంలో 'జయశంకర్ బడిబాట' ప్రారంభం
- ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య
- పిల్లలను బడికి పంపడం అందరి బాధ్యత: సర్పంచ్ యట జంగయ్య

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని దోతిగూడెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం 'జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచి యట జంగయ్య ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి, కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యను అందిస్తోందని తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. బడిబాట ద్వారా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఝాన్సీ, భవాని, నాయకులు ముద్దం సత్యం, మల్లయ్య, బాల్రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిన 'చక్రం'.. ప్రయాణికులకు తిప్పలు

- సమ్మెతో నిర్మానుష్యంగా చౌటుప్పల్ బస్టాండ్
- డిపోలకే పరిమితమైన బస్సులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె సెగ చౌటుప్పల్ పట్టణాన్ని తాకింది. కార్మికులు బుధవారం విధులను బహిష్కరించి నిరసన బాట పట్టడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో పట్టణంలోని బస్టాండ్ ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా మారింది. ఎక్కడికక్కడ సర్వీసులు నిలిచిపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే వారు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు వాహనదారులు దీన్ని అదనుగా తీసుకుని అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి సమ్మెను విరమింపజేయాలని కోరుతున్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




## నేను మలయాళీని కాదు.. తమిళ అమ్మాయిని

టాలెంట్, సహజమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సాయి పల్లవి, ప్రస్తుతం బాలీవుడ్‌లో రణబీర్ కపూర్ సరసన 'రామాయణ' చిత్రంలో సీతగా నటిస్తూ బిజీగా ఉంది. అయితే, కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా, గతంలో తాను చేసిన ఒక వ్యాఖ్యను కొందరు వక్రీకరించడంపై తాజాగా ఆమె స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. అసలు ఏం జరిగిందంటే... దాదాపు నాలుగేళ్ల క్రితం ఒక ప్రెస్ మీట్‌లో, "మీరు మలయాళీలు అయి ఉండి తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారు?" అని ఒక రిపోర్టర్ ప్రశ్నించారు. దానికి సాయి పల్లవి సమాధానమిస్తూ, "నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు" అని స్పష్టం చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత కొందరు ఈ మాటలను వక్రీకరించి, "మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది" అంటూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ ప్రచారంపై తాజాగా ఆమె స్పందిస్తూ.. "ఆ హెడ్‌లైన్ చూసి నేను షాక్‌కు గురయ్యాను. నేను అనని మాటలను నాపై మోపడం బాధాకరం. నేను కోయంబత్తూరులో పుట్టి పెరిగాను, నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం నాకు లేదు" అని సాయి పల్లవి వివరణ ఇచ్చింది.

## రూటు మార్చిన లేడి సూపర్ స్టార్ ఒక వైపు సీనియర్..

నయనతార మునుపటిలా .. ఇప్పుడు లేదు. గతంలో మూవీ ఓపెనింగ్స్, ప్రమోషన్స్ చేయనంటూ బెట్టు చేసేది. మీడియాకు ఇంటర్వ్యూస్ ఇచ్చేది కాదు. నౌ ఆ రూల్స్ బ్రేక్ చేస్తోంది. కెరీర్ విషయంలో కూడా అంతే నేను లేడీ సూపర్ స్టార్‌ను కదా టైర్ 1 హీరోలతోనే జోడీ కడతానని గిరిగీసుకొని కూర్చోవట్లేదు. సీనియర్స్ సినీయర్సే జూనియర్స్ జూనియర్సే అంటోంది భామ. నయనతార పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ విషయంలో చాలా ఛేంజస్ కనిపిస్తున్నాయి. గతంలో యాడ్స్ చేసేది కాదు మూవీ ఓపెనింగ్స్‌కు వచ్చేది కాదు.. ప్రమోషన్స్ చేసేది కాదు. ఇక మీడియా ఇంటరాక్షన్ అంటే పూర్తిగా స్కిప్ చేసేది. కానీ విఘ్నేశ్ శివన్ రాకతో ఆమెలో చాలా మార్పులే కనిపిస్తున్నాయి. గతంలో ఉన్న రూల్స్‌కు బ్రేక్ చేసి ఓపెనింగ్స్, ప్రమోషన్స్ చేస్తోంది. ప్రస్తుతానికి ప్రీ రిలీజ్ ఈవెంట్స్ స్కిప్ చేస్తున్న లేడీ సూపర్ స్టార్ ఫ్యూచర్‌లో రీసెంట్లీ జరిగిన లవ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆడియో ఫంక్షన్‌లా తళుక్కున మెరిసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కెరీర్ పరంగా కూడా దూకుడు ప్రదర్శిస్తోంది లేడీ సూపర్ స్టార్. తాను స్టార్ హీరోయిన్ రేంజ్ కు వెళ్లిపోయానని కేవలం టైర్ వన్ హీరోలతోనే జోడీ కడతానని భీష్మించుకోలేదు నయన్. ఒక వైపు సీనియర్స్‌తో జోడీ కడుతూనే మరో వైపు యంగ్ బాయ్స్‌తోనూ స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. బాలీవుడ్ నుండి మాలీవుడ్ వరకు ఇదే ఫార్ములాను వర్కౌట్ చేస్తోంది బ్యూటీ. మలయాళంలో మమ్ముట్టి, మోహన్ లాల్‌తో పేట్రియాట్ చేస్తోన్న నయన్ తెలుగులో బాలకృష్ణ హిందీలో సల్మాన్ ఖాన్‌తో రొమాన్స్ చేయబోతుంది. బిగ్ బడ్జెట్ చిత్రాలు భారీగా రెమ్యునరేషన్ తీసుకుంటోన్న నయన్ లో బడ్జెట్, యంగ్ హీరోల చిత్రాలకు యస్ చెబుతోంది. యశ్ టాక్సిక్‌లో మెరవబోతున్న లేడీ సూపర్ స్టార్ కవిన్‌తో హాయ్, నివిన్ పాలీతో డియర్ స్టూడెంట్స్ చేస్తోంది. అలాగే లేడీ ఓరియెంట్ మూవీస్ వదిలిపెట్టడం లేదు. మూకుత్తి అమ్మన్ సీక్వెల్, రక్కాయ్ లాంటి యాక్షన్ ఎంటర్టైనర్స్ చేస్తోంది. ఇలా ఇయర్ బై ఇయర్ నయన్ తారలో మార్పులు కనిపిస్తున్నాయి.





## పూరీ 'స్లమ్ డాగ్' విడుదలకు అడ్డంకులు?

పూరీ జగన్నాథ్ చివరి రెండు సినిమాలు ఆయనపై ప్రభావాన్ని చూపాయి. 'లైగర్' సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై ఘోర పరాజయాన్ని మూటగట్టుకోగా ఆ సమయంలో నష్టపోయిన బయ్యర్లకు కొంత శాతం తిరిగి చెల్లిస్తానని పూరీ హామీ ఇచ్చారు. అయితే, ఆ హామీ నెరవేరలేదనే ఆరోపణలు ఉన్నా, తర్వాత వచ్చిన 'డబుల్ ఇస్మార్ట్'లిలి విషయంలోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఈ సినిమా థియేట్రికల్ నష్టాల్లో కొంత భాగాన్ని భరిస్తానని చెప్పినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చెల్లింపులు జరగలేదని డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూరీపై గతంలో ఎప్పుడూ లేనంతగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్' అనే సినిమా సిద్ధమవుతోంది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. కానీ, పాత బకాయిల ఇష్యూ ఇప్పుడు ఈ సినిమా విడుదలకు పెద్ద అడ్డంకిగా మారింది. 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' బకాయిలు తీర్చనిదే 'స్లమ్ డాగ్' విడుదలకు సహకరించబోమని తెలంగాణ డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు పట్టుబడుతున్నారు. ఇప్పటికే సుమారు రూ. 5 కోట్ల బకాయిలకు సంబంధించి ఆర్బిట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోన్న క్రమంలో ఈ గొడవలు సర్దుమణిగితేనే సినిమాను కొనుగోలు చేస్తామని ప్రముఖ ఓటీటీ సంస్థలు కూడా నిబంధనలు పెడుతున్నట్లు సమాచారం. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా బౌన్స్ బ్యాక్ అవ్వడం పూరీకి కొత్తేమీ కాదు కానీ ఈసారి సమస్యలు ఆర్థికంగానే కాకుండా, నమ్మకానికి సంబంధించినవి కూడా కావడంతో ఆయన ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. 'స్లమ్ డాగ్' సినిమా స్మూత్‌గా థియేటర్లలోకి రావాలంటే పూరీ జగన్నాథ్ స్వయంగా రంగంలోకి దిగి ఈ వివాదాలను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.

## టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్... బాలకృష్ణ-కొరటాల శివ చిత్రం!

నందమూరి బాలకృష్ణ తన జోరును కొనసాగిస్తున్నారు. వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్న ఆయన, తన తదుపరి చిత్రానికి సంబంధించి ఓ క్రేజీ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న బాలకృష్ణ, ఆ తర్వాత సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ కొరటాల శివతో పనిచేయబోతున్నారు. ఈ వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సినీ వర్గాల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం బాలకృష్ణ తదుపరి చిత్రం కొరటాల శివ దర్శకత్వంలో ఖరారైంది. నిజానికి ఈ ప్రాజెక్ట్ కోసం వివేక్ ఆత్రేయ, విజయ్ కనకమేడల వంటి యువ దర్శకుల పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ, కొరటాల శివ వినిపించిన కథాంశానికి బాలయ్య పూర్తిస్థాయిలో కనెక్ట్ అయినట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. 'అఖండ'తో మొదలుపెట్టి 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' వంటి చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలు అందుకున్న బాలయ్య, అరవై ఏళ్లు దాటినా కుర్ర హీరోలకు దీటుగా సినిమాలు చేస్తున్నారు. మరోవైపు కొరటాల శివ తనదైన ప్రత్యేక శైలితో ఇండస్ట్రీలో నిలిచారు. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'జనతా గ్యారేజ్' వంటి బ్లాక్‌బస్టర్లతో కమర్షియల్ హంగులతో పాటు బలమైన సందేశాన్ని ఇవ్వడంలో ఆయన దిట్ట. 'ఆచార్య'తో కాస్త తడబడ్డా, 'దేవర' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని నమోదు చేసి తన సత్తాను మరోసారి నిరూపించుకున్నారు. మాస్ పల్స్ తెలిసిన బాలకృష్ణ ఇమేజ్‌కి, హీరోను పవర్‌ఫుల్‌గా చూపిస్తూనే కథలో సందేశాన్ని మిళితం చేసే కొరటాల మార్క్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ పవర్‌ఫుల్ కాంబినేషన్‌పై ట్రేడ్ వర్గాల్లో సైతం భారీ అంచనాలు నెలకొన్నాయి. పక్కా కమర్షియల్ ఫార్మాట్‌లో బాలకృష్ణను కొరటాల ఎలా ప్రెజెంట్ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

